ప్రజాశక్తి
మంగళవారం 25 మార్చి 2025
5
పార్వతీపురం మన్యం



సెకండ్ గ్రేడ్ టీచర్ పరీక్షకు ఉచిత శిక్షణ

పార్వతీపురం : జిల్లాలోని బిసి, ఒబిసి అభ్యర్థులకు సెకండ్ గ్రేడ్ టీచర్ పరీక్షకు ఉచిత శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ సాధికారత అధికారి ఎస్.కృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిఎస్‌సి పరీక్షకు ఆన్లైన్ ద్వారా శిక్షణా తరగతులు నిర్వహిస్తామన్నారు. ఈ శిక్షణకు దరఖాస్తు చేయు అభ్యర్థులు డిగ్రీ మార్క్‌ల జాబితా, కుల, ఆదాయ, స్థానికత తెలిపే ధ్రువీకరణ పత్రాలు, డిఎస్‌సికి ఎంపికైన అభ్యర్థులు టిఇటి (టీచర్ ఎలిజిబులిటీ టెస్ట్) మార్క్ లిస్ట్ జిరాక్స్, రెండు పాస్ పోర్ట్ సైజు ఫొటోలు దరఖాస్తుతో జత చేయాలన్నారు. పూర్తి చేసిన ధరఖాస్తులను జిల్లా బిసిసంక్షేమ, సాధికారిత అధికారి కార్యాలయం, ఆర్‌సిఎం స్కూల్, రూం నెంబర్.8, మొదటి అంతస్తు, ఆర్‌టిసి బస్టాండ్ ఎదురుగా, పార్వతీపురం వలో సమర్పించాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఫోన్ నెంబర్లు 9701786751, 9700112711ను సంప్రదించాలని ఆ ప్రకటనలో వివరించారు.

మన ఊరిబడికి మంగళం?

- జిల్లాలో 120 యుపి పాఠశాలల ఎత్తివేతకు రంగం సిద్ధం
- ప్రాథమిక విద్యను నిర్వీర్యం చేసే చర్యలు
- ప్రయివేటుకు ఊతమిచ్చే ప్రభుత్వ విధానం
- నేడు యుటిఎఫ్ ఆధ్వర్యాన విద్యార్థులు, తల్లిదండ్రులు ర్యాలీ

ప్రజాశక్తి - పార్వతీపురం

వైసిపి ప్రభుత్వ హయాంలో అనుసరించిన విద్యా విధానానికి బదులుగా ప్రజలకు మేలు చేసే విధానం రూపకల్పన చేస్తామని చెప్పిన టిడిపి ప్రభుత్వం ఆచరణలో మాత్రం దొందూ దొందే అన్న చందంగా వ్యవహరిస్తోంది. ప్రభుత్వ రంగంలో ఉన్న ప్రాథమిక విద్యను నిర్వీర్యం చేసే దిశగా అడుగులు వేస్తోంది. సామాన్య, మధ్య తరగతి ప్రజలు పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్టు ప్రస్తుత ప్రభుత్వం విద్యావిధానం రూపొందించింది. ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలలకు ఊతమిచ్చేలా ఈ విధానం ఉంది. జీవో 117ను రద్దు చేస్తామని చెప్పి అంతకంటే దారుణమైన రీతిలో ప్రాథమిక విద్యను చిన్నాభిన్నం చేసే చర్యలకు శ్రీకారం చుట్టింది. గత ప్రభుత్వ హయాంలో జీవో 117లో భాగంగా 1 నుంచి 5వ తరగతి వరకు ఉండే ప్రాథమిక పాఠశాల నుంచి 3,4,5 తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం జరిగింది. అంటే 3నుంచి పదోతరగతి వరకు ఉన్నత పాఠశాలలోనే చదువుకునేలా వైసిపి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. తాజా విధానం వల్ల మన్యం జిల్లాలోని సుమారు 120 యుపి పాఠశాలల ఎత్తివేయనున్నట్లు తెలుస్తోంది. ఈ విధానాన్ని ఉపాధ్యాయ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకించినా గత ప్రభుత్వం ముందుకెళ్లోంది. దీని వల్ల కొన్ని ప్రాథమిక పాఠశాలల



మూతపడనున్న వీరఘట్టం మండలం కిమ్మి ప్రాథమికోన్నత పాఠశాల

ఎత్తివేతకు దారి తీసింది. జిఒ 117 గురించి టిడిపి కూటమి పార్టీలు విస్తృతంగా ప్రచారం చేసుకుని లబ్ధిపొందాయి. అన్ని గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలు ఉండేలా చర్యలు తీసుకుంటామని చెప్పిన టిడిపి కూటమి అధికారంలోకి వచ్చింది. జీవో 117ను రద్దు చేసి ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసిన 3,4,5 తరగతులను వెనక్కి తీసుకొస్తామని చెప్పింది. అంతవరకు బాగానే ఉంది. టిడిపి ప్రభుత్వం రూపకల్పన చేసిన విధానం కూడా చాలా గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలల మూసివేతకు కారణమవుతోంది.

తాజాగా టిడిపి కూటమి అమలు చేయబోయే విధానం వల్ల భవిష్యత్తులో ప్రాథమిక విద్యారంగం తీవ్ర ప్రమాదంలో పడుతుందని యుటిఎఫ్ హెచ్చరిస్తోంది. ప్రాథమిక పాఠశాలల నుంచి 3,4,5 తరగతులను వేరుచేసి కొత్తగా ఏర్పాటు చేయబోయే మోడల్ ప్రాథమిక పాఠశాలల్లో విలీనం చేసేందుకు రంగం సిద్ధం చేస్తోంది. పంచాయతీకొక మోడల్ ప్రాథమిక పాఠశాలను ఏర్పాటు చేసి సమీపంలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో ఉన్న 3,4,5 తరగతులను విలీనం చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. అంటే గ్రామాల్లో వున్న ప్రాథమిక పాఠశాలలను ఫౌండేషన్ పాఠశాలలుగా మార్చాలని ప్రభుత్వం భావిస్తోంది. 1,2 తరగతులతో ఫౌండేషన్ పాఠశాలలు ఏర్పాటు చేయడం ద్వారా భవిష్యత్తులో గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలలు కనుమరుగయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయి. పంచాయతీ కొక మోడల్ ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేసి అక్కడ తరగతికొక ఉపాధ్యాయుడ్ని నియమిస్తామని ప్రభుత్వం చెపుతోంది. ప్రాథమిక పాఠశాలలను ఫౌండేషన్ పాఠశాలలుగా మార్చడం వెనుక వాటిని నిర్వీర్యం చేసే కుట్ర దాగి వున్నట్లు తెలుస్తోంది. ఫలితంగా గ్రామాల్లో ప్రాథమిక విద్య అందించే బడి కనిపించని పరిస్థితి కనిపిస్తోంది. అంతేకాకుండా మోడల్ ప్రాథమిక పాఠశాలకు వెళ్లే 3,4,5తరగతుల విద్యార్థులు కనీసం 3 నుంచి 5 కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లాల్సి ఉంటుంది. ఈ కారణాల రీత్యా పిల్లలను తల్లిదండ్రులు మోడల్ ప్రాథమిక పాఠశాలకు పంపించే అవకాశం లేదు. ప్రయాణ భత్యం ఇస్తామని చెపుతున్నా అది ఆచరణలో ఎంతవరకు అమలవుతుందనేది ప్రశ్నార్థకంగా వుంది. ప్రాథమిక విద్యను నిర్వీర్యం చేయడంలో వైసిపి, టిడిపి విధానం దొందూ దొందే అన్న చందంగా తయారైంది.

యుపి పాఠశాలల ఎత్తివేత

తాజా విధానం వల్ల మన్యం జిల్లాలోని సుమారు 120 యుపి పాఠశాలల ఎత్తివేయనున్నట్లు తెలుస్తోంది. న్నారు. దీని వల్ల ఉపాధ్యాయ పోస్టుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతుంది. ఈ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను ఉన్నత పాఠశాలలకు, మోడల్ ప్రాథమిక పాఠశాల లకు సర్దుబాటు చేసే అవకాశం ఉంది. ప్రస్తుతం జిల్లాలో 1నుంచి 5 వరకు నడిచే ప్రాథమిక పాఠశాలలు 504 వున్నాయి. వీటిని విచ్చిన్నం చేయడం ద్వారా సుమారు 250 ఫౌండేషన్ పాఠశాలలు ఏర్పాటు కానున్నాయి. సుమారు 350 మోడల్ ప్రాథమిక పాఠశాలలు ఏర్పాటు కానున్నాయి. ప్రాథమిక విద్యను ముక్కలు చేయడం ద్వారా పేదలకు విద్యను దూరం చేయడమేనని ఉపాధ్యాయ సంఘాలు భావిస్తున్నాయి. ప్రస్తుత విధానం వల్ల భవిష్యత్తులో ఎదురయ్యే పరిణామాల గురించి గ్రామాల్లో ప్రజలను చైతన్యం చేసే పనిలో యుటిఎఫ్ నాయకత్వం ఉంది. మున్ముందు ఏయే గ్రామాలకు ప్రాథమిక విద్య అందని ద్రాక్షలా మారుతుందో అవగాహన కల్పిస్తున్నారు. ఈనెల 25న పెద్ద ఎత్తున విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి యుటిఎఫ్ ఆధ్వర్యాన ఉపాధ్యాయులు ఆందోళన చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

నిరసన ర్యాలీని జయప్రదం చేయండి : యుటిఎఫ్

సీతానగరం : పాఠశాలల అసంబద్ధ విలీనీకరణకు వ్యతిరేకంగా 'మన ఊరు బడిని కాపాడుకుందాం" అన్న నినాదంతో యుటిఎఫ్ మంగళవారం పార్వతీపురంలో తలపెట్టిన నిరసన ర్యాలీలో జిల్లాలోని అన్ని మండలాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యాభిలాషులు అధిక సంఖ్యలో పాల్గొనాలని యుటిఎఫ్ మండల అధ్యక్ష ప్రధానకార్యదర్శులు పి. శ్రీనివాసరావు, బి. ప్రసాదరావు, ఉపాధ్యక్షులు ఎ. పోలినాయుడు, జిల్లా కౌన్సిల్ సభ్యులు బి. ఆదినారాయణ, ఎం గోవిందరావు జె. సింహాచలం కోరారు. ఈ మేరకు సోమవారం సీతానగరంలో జరిగిన యుటిఎఫ్ మండల కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడుతూ 3,4,5 తరగతులను సమీప పాఠశాలల్లో విలీనం చేయడాన్ని వ్యతిరేకిస్తూ ప్రాథమిక పాఠశాలలను నిర్వీర్యం చేసే ప్రభుత్వ చర్యలను అడ్డుకుంటామని తీర్మానించింది.

వీరఘట్టం : యుటిఎఫ్ ఆధ్వర్యంలో పార్వతీపురంలో మంగళవారం నిర్వహించనున్న మన ఊరు బడిని కాపాడుకుందాం ర్యాలీని జయప్రదం చేయాలని, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి మజ్జి పైడిరాజు ఒక ప్రకటనలో కోరారు. డిఇఒ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు నిర్వహించనున్న భారీ ర్యాలీలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఎస్ఎంసి చైర్మన్లు అధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు.

'పురం'లో రాజకీయం గరం గరం

- చైర్‌పర్సన్ పై అవిశ్వాస తీర్మానానికి రంగం సిద్ధం
- 19మంది కౌన్సిలర్ల సంతకాలతో నోటీసు అందజేత
- చక్రం తిప్పిన ఎమ్మెల్యే బోనెల

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లా కేంద్ర పురపాలక సంఘంలో రాజకీయం గరం గరంగా మారుతోంది. ఇంతవరకు చాపకింద నీరులా సాగిన కౌన్సిలర్ల ఫిరాయింపులు సోమవారంతో చరమాంకానికి చేరాయి. మున్సిపల్ కౌన్సిల్‌లో ఆరుగురు కౌన్సిలర్ల బలం కలిగిన టిడిపి ఇప్పుడు 19 మందికి చేరింది. 13 మంది వైసిపి కౌన్సిలర్లు టిడిపిలో చేరారు. మరో కౌన్సిలర్ కూడా టిడిపి తీర్థం పుచ్చుకునే అవకాశం ఉన్నట్టు తెలిసింది. దీంతో చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరిపై అవిశ్వాస తీర్మానం ప్రతిపాదించడానికి మార్గం సుగమమైంది. సోమవారం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర నాయకత్వంలో టిడిపి కౌన్సిలర్లు జిల్లా జాయింట్ కలెక్టర్ శోబిక మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లుకు అవిశ్వాస తీర్మానం నోటీసులు అందజేశారు. మున్సిపాలిటీలో వైసిపి పాలకవర్గం నాలుగేళ్ల క్రితం పగ్గాలు చేపట్టింది. నాలుగేళ్ల తర్వాత అవిశ్వాస తీర్మానం ప్రతిపాదించేందుకు అవకాశం ఉండడంతో టిడిపి ఆ అవకాశాన్ని వినియోగించుకునే దిశగా అడుగులు వేస్తోంది. ఎమ్మెల్యే విజయచంద్ర దశలవారీగా వైసిపి కౌన్సిలర్లకు గాలం వేసి టిడిపిలోకి తీసుకుని రావడంలో విజయవంతమయ్యారు. మరో నాలుగేళ్ల పాటు రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వం అధికారంలో కొనసాగనున్న నేపథ్యంలో వైసిపి కౌన్సిలర్లు టిడిపిలోకి ఫిరాయించారు. అయితే ప్రస్తుతం టిడిపిలో చైర్ పర్సన్ పదవి ఎవర్ని వరిస్తుందనే చర్చ మొదలైంది. గత అసెంబ్లీ ఎన్నికల ముందు వైసిపి నుంచి టిడిపిలో చేరిన కీలక పట్టణ నాయకుడి భార్యకు చైర్‌పర్సన్ పీఠం కట్టబెడతారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అంగబలం, అర్థబలం



జెసికి వినతిని అందజేస్తున్న టిడిపి కౌన్సిలర్లు

కలిగిన ఆ నాయకుడు గత కొంతకాలంగా పట్టణ రాజకీయాల్లో క్రియాశీల పాత్ర పోషిస్తున్నారు. ఎమ్మెల్యేకు సన్నిహితంగా వ్యవహరిస్తుండడంతో ఆ నాయకుడి భార్యకే చైర్మన్ పీఠం దక్కే అవకాశాలున్నాయి.

జోగారావుకు ఝలక్

వైసిపి ప్రభుత్వం అధికారంలో వున్నంతకాలం మున్సిపాలిటీలో వైసిపి పాలకవర్గం తరపున అప్పటి ఎమ్మెల్యే జోగారావే అన్నీ తానై నడిపించారు. చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరితో పాటు 24 మంది కౌన్సిలర్లను తన కనుసన్నల్లో నడిపిస్తూ మున్సిపాలిటీలో చక్రం తిప్పారు. పది నెలలు క్రితం జరిగిన ఎన్నికల్లో వైసిపి ఘోర పరాజయం పాలవడంతో పాటు ఆయన కూడా ఓటమి పాలయ్యారు. పట్టణ పార్టీలో కూడా మాజీ ఎమ్మెల్యే జోగారావు పట్ల తీవ్ర అసంతృప్తి గూడుకట్టుకుని వుంది. పాలకవర్గంలో నెలకొన్న గ్రూపు రాజకీయాల కారణంగా చైర్‌పర్సన్ పదవిని పార్టీకి చెందిన సీనియర్ నాయకులు ఆశించారు. అయితే తన చెప్పుచేతల్లో వుండే వ్యక్తిని చైర్‌పర్సన్ కుర్చీపై కూర్చోబెట్టడంలో జోగారావు కృతకృత్యులయ్యారు. పార్టీ నాయకత్వం పట్ల ఇంతవరకు నివురుగప్పిన నిప్పులా దాగివున్న అసంతృప్తి నాలుగేళ్ల తర్వాత వెల్లుబికింది.

టిడిపి గూటికి మరో ఇద్దరు వైసిపి కౌన్సిలర్లు

పార్వతీపురం టౌన్ : పురపాలక సంఘంలో వైసిపికి 1, 30 వార్డుల వైసిపి కౌన్సిల్ సభ్యులు రణభేరి చిన్నం నాయుడు, బంగారు నాయుడులు సోమవారం స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర సమక్షంలో పసుపు కండువా కప్పుకుని టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. వీరు ఇరువురితోపాటు వైసిపి పార్టీ కో ఆప్షన్ సభ్యులు మేరువ వెంకట్రావు ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు నచ్చి ఎమ్మెల్యే విజయ్ చంద్ర నియోజకవర్గ అభివృద్ధికి చేస్తున్న కృషి నచ్చి పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు.

ఏనుగుల జోన్ ప్రతిపాదనను రద్దు చేయాలి

సిపిఎం ఆధ్వర్యాన తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని అమ్మాదేవి కొండపైన ఏనుగుల జోన్ ఏర్పాటు ప్రతిపాదనను రద్దు చేయాలని సిపిఎం జిల్లా నాయకులు రెడ్డి వేణు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యాన ఎలిఫెంట్ జోన్ ప్రభావిత గ్రామాలైన అప్పయ్య పేట, రేపటి వలస, తామర ఖండి, జోగంపేట, గుచ్చిమి తాన సీతారాంపురం చిన్నారాయుడిపేట, పార్వతీ పురం మండలం పులుగుమ్మి, గబవలస గ్రామాల ప్రజలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ సీతానగరం, పార్వతీపురం మండలాల పరిధిలో గల అమ్మా దేవి కొండ వద్ద సుమారు 10 గ్రామాల్లో 1100 ఎకరాలు విస్తీర్ణంలో గల కొండ సరిహద్దుల్లో ఏనుగులు జోన్ పేరుతో అటవీ అధికారులు చేపట్టిన (కందకాలు) ట్రెంచ్ కటింగ్ పనులు రైతులకు ప్రజలకు తెలియకుండా, గ్రామ సభలు జరపకుండా మొండిగా పనులు చేపట్టారన్నారు. ఏనుగులు జోన్‌ను జిల్లా నడిబొడ్డున గల సీతానగరం మండలంలో పెట్టడమంటే ఇటు మండల ప్రజలు, అటు జిల్లా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడడమేనని, కావున ఈ ప్రతిపాదన



తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఎలిఫెంట్ జోన్ గ్రామాల ప్రజలు, ప్రజాసంఘాల నాయకులు

ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాంతంలో కందకాలు తవ్వకాలు చేపట్టడం వల్ల గిరిజనులు, దళితులు, పేదల భూములు నాశనమవుతున్నాయని ఆందోలన వ్యక్తం చేశారు. కొండ దిగున గల రైతుల భూములకు వర్షాకాలంలో గెడ్డల ద్వారా చెరువులకు నీరు చేరుతుందని, ఇప్పుడు కందకాల తవ్వడం వల్ల చెరువుల్లోకి నీరు రాకుండా నిలిచిపోతుందని తద్వారా చెరువులు ఎండిపోతాయని అన్నారు. ఖరీఫ్ సీజన్లో రైతుల పంటలకు నష్టం వాటిల్లుతుందని, గిరిజనులు, దళితులు, పేదల సాగులో ఉన్న భూములకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. అటవీ శాఖ అధికారులు దౌర్జన్యంగా చేస్తున్న పనులను ఆపాలని, ఫ్రెంచ్ కటింగ్ పనులు నిలుపుదల చేయాలని, కొండ చుట్టూ గల గ్రామాల ప్రజలకు, రైతులకు రక్షణ కల్పించాలని కోరారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిని అందజేశారు. కోరుతున్నమని తెలిపారు.

కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు రెడ్డి ఈశ్వరరావు, గవర వెంకటరమణ, రెడ్డి రమణమూర్తి, బి అప్పారావు, సిహెచ్ కృష్ణ, బాధిత గ్రామాల ప్రజలు సింహాద్రి దొర, జన్ని శ్రీధర్, ఎస్,మేరమ్మ, ఎన్, వాసు, బాత శంకర రావు, ప్రసాదు, కొండపల్లి అప్పారావు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారంలో అధికారుల నిర్లక్ష్యం

రెవెన్యూ కార్యాలయం వద్ద వ్యవసాయ కార్మిక, గిరిజన సంఘం ఆధ్వర్యాన పేదలు ధర్నా

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని భూ సమస్యల పరిష్కారంలో రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఎపి వ్యవసాయ కార్మిక, ఆదివాసి గిరిజన సంఘాల ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద బాధిత ప్రజలతో సోమవారం ధర్నా జరిగింది. ఈ ధర్నానుద్దేశించి ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి కె.గంగునాయుడు, ఆదివాసీ గిరిజన సంఘం మండల నాయకులు పాడంగి ప్రభాకర్ రావు మాట్లాడారు. శంబర, తూరుమామిడిలో సుమారు 45 ఎకరాల భూమిని పెత్తందారులు ఆక్రమించారని, విచారణ చేపట్టాలని, ఈ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని అర్హులైన పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. వెంకట భైరిపురం, లోతుగెడ్డ, మోసూరువలస, మొకవలస, సీబిల్లిపెద్దవలసలో ప్రభుత్వ భూములు సాగు చేస్తున్న పేదలు, గిరిజనులకు డి-పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లోవరకండి, దుగ్గేరు, ఆళ్లగురువు గ్రామాల్లో పోడు సాగు చేస్తున్న గిరిజనులకు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. మండలంలోని అనేక గ్రామాల్లో తరతరాలుగా పేదలు, గిరిజనులు సాగు చేస్తున్న బంజరు భూములకు డి -పట్టాలు ఇవ్వకుండా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనేక గ్రామాల్లో పేదల భూములు అన్యాక్రాంతమైనా రెవెన్యూ అధికారులు చూసీ చూడనట్టు పెత్తందారులకు కొమ్ముకాస్తున్నారని విమర్శించారు. అన్యాక్రాంతమైన పేదల భూములకు తిరిగి పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. సాగు చేసుకుంటున్న గిరిజనుల పోడు భూములకు 10 ఎకరాలకు తగ్గకుండా వెంటనే పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై అనేక సార్లు గ్రీవెన్స్‌లో విన్నవించినా నేటికీ ఎలాంటి స్పందన లేదని అన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్తులో తహశీల్దార్ కార్యాలయంలోనే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు మాట్లాడుతూ పేదల భూముల పరిష్కారంపై ఏళ్ల తరబడి



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ప్రధానకార్యదర్శి గంగునాయుడు

అధికారులు చెప్ప తప్ప పరిష్కారం కావడంలేదన్నారు. భూ సమస్యలపై పేదలు చేసే పోరాటాలకు కార్మిక సంఘం మద్దతు ప్రకటిస్తున్నామని తెలిపారు. అనంతరం ధర్నా వద్దకు తహశీల్దార్ ఇబ్రహీం, రెవెన్యూ అధికారులు వచ్చి ప్రజలతో చర్చించారు. ఇప్పటికే ఈ సమస్యలపై విఆర్ఒ, ఇతర అధికారులకు తెలియజేశామని, ఒక వారంలోగా పేదల భూ సమస్యలు పరిష్కరిస్తామని తహశీల్దార్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గిరిజన, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పి.సీతారాం, దాడి శ్రీను, చినబాబు, గోపి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది, ఎన్‌జిఒ సంఘాల నాయకులు

క్షయ నివారణ ప్రజలందరి బాధ్యత

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ పిలుపునిచ్చారు. ప్రపంచ క్షయ (టి.బి) నివారణ దినోత్సవం సందర్భంగా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ర్యాలీని సోమవారం నిర్వహించారు. అనంతరం స్థానిక ఎన్‌జిఒ హోంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమం లో పిఒ మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో సర్వే చేసి క్షయ వ్యాధి లక్షణాలున్న వారిని వైద్య సిబ్బంది గుర్తించాలన్నారు. జిల్లాలో అన్ని ప్రభుత్వాసు పత్రుల్లో ఆధునికమైన టిబి నిర్ధారణ పరీక్షలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. వ్యాధిగ్రస్తు లకు ఆరు నెలలకు సరిపడా ఉచితంగా మందులు, ప్రతి నెలా వెయ్యి రూపాయలు చొప్పున ఆరు నెలలు వ్యాధి బాధితుల ఖాతాలో జమ అవుతాయ న్నారు. మందులు క్రమం తప్పకుండా వేసుకొనేలా సిబ్బంది పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. లయన్స్ క్లబ్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్, రెడ్ క్రాస్, వర్తక సంఘాలు, ప్రభుత్వ అధికారులు నిక్షయ్ మిత్రగా చేరి భాగస్వాములు అవుతున్నారని, ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని, టిబి రహిత జిల్లాగా తీర్చు దిద్దేందుకు సహరించాలని కోరారు. అనంతరం ఉత్తమ సేవలు అందించిన వైద్యులు, వైద్య సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్.భాస్కర రావు, జిల్లా క్షయ నియత్రణ అధికారి డాక్టర్ ఎం.వినోద్ కుమార్, ఆర్‌బిఎస్‌కె జిల్లా సమన్వయ అధికారి డాక్టర్ పిఎల్ రఘు కుమార్, ఎన్‌జిఒ జిల్లా అధ్యక్షులు జివిఆర్ఎస్ కిషోర్, ఐఎంఎ జిల్లా అధ్యక్షులు డాక్టర్ యాళ్ల వివేక్, తదితరులు పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రిలో వరల్డ్ ఓరల్ హెల్త్ డే

సీతంపేట : స్థానిక ఏరియా ఆసుపత్రిలో వరల్డ్ ఓరల్ హెల్త్ డే సందర్భంగా ఏరియా ఆసుపత్రి సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ దంతాలు పరిశుభ్రతంగా ఉంచుకోవడం మానవుడికి చాలా ముఖ్యమన్నారు. రెండు పూటలా దంతాలు శుభ్రం చేసుకోవాలని కోరారు. ఖైనీ, గుట్కాలు మానేయాలని చెప్పారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం : జెసి

పిజిఆర్ఎస్ కు అందిన 98 అర్జీలు

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేయాలని సంయుక్త కలెక్టర్ ఎస్.ఎస్.శోబిక జిల్లా అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమం జెసి అధ్యక్షతన సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ, డిఆర్ఒ కె.హేమలత, కెఆర్ఆర్సి ప్రత్యేక ఉప కలెక్టర్ పి.ధర్మచంద్రారెడ్డితో కలిసి 98 మంది అర్జీదారుల నుంచి జెసి వినతులను స్వీకరించారు. కార్యక్రమం అనంతరం జెసి మాట్లాడుతూ పిజిఆర్ఎస్ ద్వారా అందిన అర్జీలకు ప్రత్యేక ప్రాధాన్యతను ఇచ్చి పరిష్కరించాలని అన్నారు. జిల్లా అధికారులు వారి శాఖలకు సంబంధించిన అర్జీలను క్షుణంగా పరిశీలించి తమ సిబ్బందితో నిర్ణీత గడువులోగా పరిష్కారమ య్యేలా చూడాలని తేల్చిచెప్పారు. ఎటువంటి అర్జీలు రీఓపెన్ కాకుండా పరిష్కారానికి చర్యలు ఉండాలని అధికారులకు ఆమె దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వికలాంగురాలైన పాలకొండ మండలానికి చెందిన సుందరగిరి శ్రీజా భవాని తనకు టచ్ ఫోన్ కావాలని ఇదివరకు వినతి పత్రాన్ని అందజేయడంతో ఆమెకి జేసీ టచ్ ఫోన్ ను పంపిణీ చేశారు. అన్నిశాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పరిష్కారంలో అలసత్వం వద్దు : ఎస్‌పి

పార్వతీపురంరూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదులపై తక్షణమే సమగ్ర విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తామని ఎస్పీ ఎస్‌విమాధవ్ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన స్థానిక జిల్లా పోలీస్ కార్యాలంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించి, అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో 13 ఫిర్యాదులు అందాయి.

పిజిఆర్ఎస్‌కు 40 వినతులు

సీతంపేట : స్థానిక ఐటిడిఎలో ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 40 అర్జీలు వచ్చాయి. ఐటిడిఎ పిఒ యశ్వంత్‌కుమార్ రెడ్డిఆధ్వర్యంలో సోమవారం వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో ఎపిఒ చినబాబు, పిహెచ్ఒ ఎస్‌వి గణేష్, ఈఈ రమాదేవి, సిడిపిఒ రంగలక్ష్మి, పాల్గొన్నారు.

టెండరుదారులకు ఆహ్వానం

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐటిడిఎ ఆధ్వర్యంలోని గిరిజన సహకార సంస్థ (జీసీసీ) గిరిజనుల నుంచి సేకరించిన అటవీ ఉత్పత్తులైన కొండచీపుర్లు, కుంకుడు కాయలు, పసుపు కొమ్ములకు అడ్వాన్సు టెండర్ నిర్వహించేందుకు ఆసక్తి కలిగిన టెండర్‌దారులను ఆహ్వానిస్తున్నట్లు ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అడ్వాన్స్ టెండర్ కార్యక్రమాన్ని ఈనెల 26 ఉదయం 10:30 గంటలకు స్థానిక ఐటిడిఎ ఎస్.ఆర్ శంకరన్ మీటింగ్ హాల్ వద్ద నిర్వహిస్తామన్నారు. గిరిజనుల నుంచి సేకరించిన 5వేల కొండచీపుర్లు, 100 క్వింటాళ్ల కుంకుడు కాయలు, 100 క్వింటాళ్ల పసుపు కొమ్ములకు అడ్వాన్స్ టెండర్లు నిర్వహించబడును. కావున పై ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు ఆసక్తి గల వ్యాపారులు ఈ అడ్వాన్స్ టెండర్ లో పాల్గొనవచ్చునని పీవో తెలిపారు. పూర్తి వివరాలకు ఐటిడిఎలోని జీసీసీ కార్యాలయాన్ని సంప్రదించాలని పీవో తెలిపారు.

అకాల వర్షాలతో మొక్కజొన్న రైతుకు ఇబ్బందులు

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలో కురుస్తున్న అకాల వర్షాలతో మొక్కజొన్న రైతులు ఇబ్బందులు పడుతు న్నారు. మండలంలో ఆదివారం సాయంత్రం, సోమవారం వేకువ జామున తేలికపాటి వర్షాలు కురిశాయి. దీంతో పొలాల్లోనూ, రోడ్లపై ఆరబెట్టిన మొక్కజొన్న గింజలను తడకుండా తార్పన్లు కప్పేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మండలంలో రబీ సీజన్లో 3,500 ఎకరాలకు పైగా మొక్కజొన్న పంట సాగవుతుంది. ప్రస్తుతం 90 శాతం పంట పండి పొలాల్లో సిద్ధంగా ఉంది. ప్రస్తుతం మొక్కజొన్న రైతులు కూలీలతో మొక్కజొన్న కంకిలను ఇరిసి మిషన్ల ద్వారా ఆడించి వచ్చిన గింజలను పొలాల్లో, రోడ్లపై ఆరబెట్టే పనుల్లో నిమగ్నమై ఉన్నారు. అకాల వర్షాలు కురవడంతో ఆరబెట్టిన గింజలను వర్షానికి తడవకుండా టార్పన్లు కప్పి జాగ్రత్తపర్చుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు.



మొక్కజొన్న పంట తడవ కుండా టార్పన్లు కప్పిన రైతులు

గుమ్మలక్ష్మీపురం మన్యంలో భారీ వర్షం

గుమ్మలక్ష్మీపురం : గుమ్మ లక్ష్మీపురం మన్యంలో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. సుమారు రెండు గంటల పాటు ఈదురు గాలులతో పాటు కురిసిన భారీ వర్షంతో గుమ్మలక్ష్మీపురం గ్రంథాలయం, ప్రభుత్వ పాఠశాల ఆవరణంలో భారీ వృక్షం కూలిపోయింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. మరోవైపు జియమ్మవలస మండలంలో అర్ధరాత్రి ఒంటి గంట నుంచి వేకువ జామున మూడు గంటల వరకు భారీ వర్షం కురిసింది. మండుటెండలు, ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలకు ఈ వర్షం ఎంతో ఉపశమనం ఇచ్చిందని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వేసవి పంటలకు ఈ వర్షం ఎంతో అనుకూలంగా ఉంటుందని రైతులు భావిస్తున్నారు.

శ్యామలాంబ పండగ ఏర్పాట్లపై ఎఎస్‌పి సమీక్ష

సాలూరు: ఈ ఏడాది మే నెలలో నిర్వహించనున్న శ్యామలాంబ పండుగ నేపథ్యంలో ఉత్సవ కార్యక్రమాలు, బందోబస్తు ఏర్పాట్లపై ఎఎస్పీ అంకిత సురానా సోమవారం సాయంత్రం సమీక్షించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ అక్కేన అప్పారావు, సభ్యులతో ఆమె చర్చించి ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట సిఐలు బి.అప్పలనాయుడు, రామకృష్ణ వున్నారు.

బంజరు భూములకు పట్టాలివ్వాలి

ప్రజాశక్తి- సాలూరు రూరల్

అటవీ, అన్ సర్వేడ్, బంజరు భూములకు పట్టాలు ఇవ్వాలని ఖరసు వలస, నెలిపర్తి దళితలకు రక్షణ కల్పించాలని కోరుతూ సోమవారం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు మాట్లాడుతూ మండలంలో అటవీ, బంజరు, అన్‌సర్వేడ్ భూములు సాగు చేస్తున్న వారికి పట్టాలిస్తామని గతంలో రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించి కొందరకు పట్టాలను అందజేసి మమ అనిపించారని ఇంకా చాలా మంది రైతులకు పూర్తిగా పట్టాలి ఇవ్వలేదని చెప్పారు. దీంతో ప్రభుత్వం అందించే సబ్సిడీలు రాయితీలను నష్టపోవాల్సి వస్తుందని ఎప్పటి నుండో జిల్లేడువలస గొర్రె పనికివలస గిరిజనులు ఆందోళన చేస్తున్నా రెవెన్యూ సిబ్బంది కనీసం కన్నెత్తి చూడటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లేడువలస, బొర్రపనకువలస గిరిజనులకు ఆందోళన సందర్భంగా పట్టాలిస్తామని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, రెవెన్యూ అధికారులు హామీ ఇచ్చి సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ పట్టాలు ఇవ్వలేదని తెలిపారు. కరసువలస, నెలిపర్తి గ్రామాలకు చెందిన దళితులు సాగు చేస్తున్న ప్రభుత్వ భూములకు పట్టాలు ఇవ్వాలని దళితులపై దాడులు జరగకుండా చూడాలని కోరారు. సుతాపల్లి రాము భూ అక్రమాలపై సమగ్ర దర్యాప్తు చేసి ఆక్రమణ చేసిన ప్రభుత్వ భూములను పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. అటవీ బంజరు, అన్ సర్వేడ్ భూముల సాగు చేస్తున్న వారందరికీ పూర్తిగా పట్టాలివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం మండల అధ్యక్షులు సుందర్ రావు, బొంగ కృష్ణ, లింగాల ప్రసాదు, రేజేటి పోలయ్య తదితరులు పాల్గొన్నారు.



సాలూరు: నిరసన తెలుపుతున్న రైతులు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

సాగు భూములకు పట్టాలు మంజూరు చేయాలి

పాచిపెంట: మండలంలో గిరిజనులు సాగు చేస్తున్న భూములకు పట్టాలు మంజూరు చేయాలని సిపిఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ డి.రవికి సోమవారం వినతిని అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ నందాపూడి రెవెన్యూలో సాగు చేస్తున్న సరాయివలస, చొక్కాపువానివలస 45 గిరిజన కుటుంబాలకు వెంటనే పట్టాల మంజూరు చేయాలని, 113 సర్వేనెంబర్ కొండ తాడూరు రెవెన్యూ భూములకు సాగు పట్టాలు మంజూరు చేయాలని, 48 సర్వే నెంబర్‌లో 782 ఎకరాలు గిరిజనుల సాగు చేస్తున్న కుడుమూరు భూములకు వెంటనే పట్టాలు గిరిజనులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. మూటకూడు, బొడ్డపాడు, అడారిపాడు ప్రాంతాల్లో అటవీ పోడు భూములు సాగు చేస్తున్న గిరిజనులకు అనంతగిరి రెవెన్యూలో వారి భూములు ఉండడం వల్ల నేటికీ పట్టాలు ఇవ్వడంలేదని, వెంటనే అనంతగిరి రెవెన్యూ నుంచి తప్పించి వారికి హక్కులు కల్పించాలని అన్నారు. చింత రాంబాబు మాట్లాడుతూ రాయిగుడ్డివలస పంచాయతీ పూడి రెవెన్యూ వద్ద పది ఎకరాలకు పైగా ఉన్న గిరిజనుల భూమిని తాతల కాలం నుంచి సాగు చేస్తున్నా తమకు తెలియకుండా గురువునాయుడుపేటకు చెందిన ఇందూరి ప్రకాష్ తన కుటుంబ సభ్యుల పేరున అక్రమంగా పట్టాలు చేయించుకున్నారని, వారి పట్టాలు రద్దు చేసి తమకు న్యాయం చేయాలని కోరారు. దీనికి తహశీల్దార్ స్పందిస్తూ ఈ సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సాగు పట్టాలు పేదలకు ఇచ్చే విషయంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. వినతిని అందజేసిన వారిలో బోను గౌరినాయుడు, కేరంగి సర్పంచ్ లచ్చయ్య, పలువురు గిరిజన రైతులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా టెన్త్ పరీక్షలు : డిఎస్‌పి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

పదోతరగతి పబ్లిక్ పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా జరిగేలా చర్యలు చేపట్టినట్లు పాలకొండ డి.ఎస్.పి ఎం.రాంబాబు తెలిపారు. గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రంలో జరుగుతున్న పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని ఆయన సోమవారం పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశించినట్లు చెప్పారు. పరీక్ష కేంద్రాల వద్ద మెడికల్ క్యాంపుల నిర్వహించి విద్యార్థుల ఆరోగ్య స్థితిగతులను కూడా చూసుకోవాలని చర్యలు చేపట్టాలని కోరారు. పరీక్షా కేంద్రానికి విద్యార్థులు వచ్చేటప్పుడు విద్యార్థులకు వాహన సదుపాయం లేకపోతే ప్రజలే స్వచ్ఛందంగా ముందుకొచ్చి పరీక్ష కేంద్రాల వద్దకు విద్యార్థులను చేర్చేలా మానవతా దృక్పథంతో సహాయం చేయాలని కోరారు. అలాగే పోలీస్ సిబ్బంది కూడా విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఇబ్బందులు కలగకుండా పరీక్షా కేంద్రాలకు వెళ్లేలా చూడాలన్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మించాలని వినతి

ప్రజాశక్తి - వీరఘట్టం

తమ వీధిలో కమ్యూనిటీ హాల్ నిర్మించాలని వీరఘట్టంలోని రెల్లి వీధికి చెందిన పలువురు సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో విన్నవించుకున్నారు. గాసి వీధిలో బోరు సదుపాయం ఏర్పాటు చేయాలని, కూరాకుల వీధిలో విద్యుత్ వైర్లు కిందకు ఉన్నాయని, వాటిని సరి చేయాలని ఫిర్యాదులు వచ్చినట్లు ఎంపిడిఒ బి.వెంకటరమణ తెలిపారు. వచ్చిన ఫిర్యాదులను సంబంధిత శాఖ అధికారులకు పంపించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎఒ డి.వెంకటరమణ, ఎపిఎం కె.రాము, ఎపిఒ జి.సత్యనారాయణ, ఎంఇఒ -2 ఆర్ ఆనందరావు తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సచివాలయంలో ఇన్‌ఛార్జీల పాలనా?

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం సచివాలయంలో ఇన్ఛార్జిల పాలన కొనసాగుతుందని ఇలా అయితే ప్రజలకు ఏం సేవలు అందుతాయని సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు బొత్తాడ గౌరీ శంకర్రావు ప్రశ్నించారు. స్థానిక సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి, గ్రామ రెవెన్యూ అధికారి, అగ్రికల్చర్ అసిస్టెంట్, సచివాలయ లైన్మెన్ పోస్టు నేటికీ భర్తీ చేయకపోవడంతో పూర్తిస్థాయిలో సేవలు అందడం లేదన్నారు. సర్వేయర్‌ను తహశీల్దార్ కార్యాలయానికి పరిమితం చేశారన్నారు. నాడు ఏ ఉద్దేశంతో సచివాలయ వ్యవస్థ ఏర్పడిందో, ప్రజల వద్దకే పాలన సేవలు అనుకున్నారో, నేడు ఆ సేవలు ప్రజలకు అందడం లేదన్నారు. మండల పరిషత్, రెవెన్యూ కార్యాలయాలకు వెళ్లి ప్రజలు సర్టిఫికెట్లు చేసుకోవాల్సి వస్తుందని అన్నారు. సచివాలయంలో రెగ్యులర్ ఉద్యోగులను నియమించి అన్ని రకాల సేవలు ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

అందుబాటులో ఎరువులు

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని గొయిది పంచాయతీలో ప్రతి రోజూ ఇంటింటికి చెత్త సేకరణ చేశామని గొయిది పంచాయతీ కార్యదర్శి కె.మధుసూదన్‌రావు తెలిపారు. తడి, పొడి చెత్త సేకరణపై గ్రామస్తులకు అవగాహన కల్పించామన్నారు. తడి, పొడి చెత్తలను వేరు చేసి వేరే చెత్త డబ్బాలు ఇచ్చామని తెలిపారు. సేకరించిన చెత్తను సేకరించి రిక్షా బండిలో చెత్త సంపద కేంద్రానికి తెచ్చి సేకరించిన తడి చెత్తను ఉపయోగించి చెత్త నుండి సంపద తయారీ కేంద్రంలో ఎరువును తయారు చేశామని తెలిపారు. ప్రస్తుతం 250 కేజీల ఎరువు అందుబాటులో ఉందన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అవసరమైతే విక్రయిస్తామని తెలిపారు.

పూతికవలసలో న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని పూతికవలసలో కురుపాం జ్యూడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జె. సౌమ్య జోస్ఫ్ సోమవారం న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె న్యాయవ్యవస్థ, మహిళా చట్టాలు, కోర్టు వ్యవహారాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాదులు రాంప్రసాద్, రాజ్ కూమార్, మండల న్యాయ సేవ కమిటీ సభ్యులు అందవరపు కోటేశ్వరరావు, ట్రైనీ ఎస్సైలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

రోడ్డుకు అడ్డంగా ఏనుగుల గుంపు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జియమ్మ వలస మండలంలో అడవి ఏనుగుల గుంపు సంచారంతో వాహనదారులు, ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం రాత్రి గవరంపేట రోడ్డుకు అడ్డంగా 8 ఏనుగుల గుంపు ఉండడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలిగింది. గంటకు పైగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఏనుగులను చూసిన వాహనదారులు ఒక్కసారిగా పరుగులు తీశారు. అటవీ శాఖ సిబ్బంది వచ్చి ఏనుగులను తరలించారు. సోమవారం సాయంత్రం అడవి ఏనుగుల గుంపు గవరంపేట పరిసర ప్రాంతంలో కనిపించింది. అడవి ఏనుగుల సంచారంతో కంటిమీద కునుకుపడడంలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎల్విన్‌పేటలో సంకల్పం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని ఎల్విన్‌పేటలో సంకల్పం కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే అనార్థాలను వివరించారు. మహిళా చట్టాలపై అవగాహన కల్పించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ట్రైనీ ఎస్ఐ విద్యశ్రీ సిబ్బంది ఉన్నారు.

ఎండల్లో జాగ్రత్తలు తప్పనిసరి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మన్యం జిల్లాలో రోజురోజుకి పెరుగుతున్న వేసవి ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకొని వివిధ సంస్థలు, దుకాణాలు, పరిశ్రమలు, భవన నిర్మాణ కార్మికులు తప్పనిసరిగా ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని ఉప కార్మిక కమిషనర్ (విజయనగరం) ఎస్‌డివి ప్రసాద్ రావు ఒక ప్రకటనలో సూచించారు. కార్మికుల రక్షణ కోసం సంబంధిత యజమానులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్మికుల పని గంటలలో మార్పులు చేసుకుని ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో నిర్మాణరంగం పనులు బయట కాకుండా లోపల చేసుకునే విధంగా చూడాలన్నారు. కార్మికులకు అందుబాటులో చల్లటి నీరు, నీడ వసతి, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

పిచ్చి మొక్కలు తొలగింపు

ప్రజాశక్తి- సీతంపేట

స్థానిక ఎస్ఐ వై.అమ్మనరావు ఆధ్వర్యంలో సోమవారం కిట్టలపాడు జంక్షన్ నుండి గోయిది మెయిన్ రోడ్డు వరకు జెసిబి ద్వారా రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు. మలుపుల వద్ద డొంకలు శుభ్రం చేయించారు. ప్రమాదాలు జరగకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకుంటున్నామని ఎదురెదురుగా వస్తున్న వాహనాలు కనిపించేలా పిచ్చి మొక్కలను తొలగిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఎస్ఐలు, ఏఎస్ఐ సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి- పాచిపెంట

మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలకు సోమవారం నుంచి బుధవారం వరకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ జరగనున్న పోషణ్‌బి, బదాయి బి శిక్షణా కార్యక్రమాన్నిఎంపిడిఒ బివిజె పాత్రో సోమవారం ప్రారంభించారు. అంగన్వాడీ కార్యకర్తలకు మూడు రోజుల పాటు పిల్లల పోషణ, పూర్వ ప్రాథమిక విద్య అంశాలపై శిక్షణ ఇస్తున్నట్టు సిడిపిఒ బి.అనంతలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో ఎంఇఒలు పెంట సత్యనారాయణ పాల్గొన్నారు.

వికలాంగులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

వికలాంగులకు ఐడి కార్డులు ఇవ్వాలని, ట్రై సైకిళ్లు వారి పర్సంటేజ్ బట్టి ఇవ్వాలని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి సూచించారు. అమరావతిలో సోమవారం నిర్వహించిన స్టేట్ అడ్వైజరీ బోర్డు ఆన్ డిసబిలిటీ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. మంత్రి డోలా వీరాంజనేయులు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో జాయింట్ సెక్రెటరీ, ఎమ్మెల్సీ కల్పలత, సోషల్ వెల్ఫేర్, డిజెబిటీ, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్, విలేజ్ వాలంటరీస్, సచివాలయ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మనస్థాపంతో యువకుడు గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. పట్టణ పోలీసులు అందించిన వివరాలు ప్రకారం.. పట్టణంలోని పార్వతీ నగర్‌కు చెందిన గల్లా తరుణ్ తాను ప్రేమించిన యువతి పెళ్లికి ఒప్పుకోలేదన్న కారణంగా మనస్తాపం చెంది సేకరించి తెచ్చుకున్న గడ్డి మందును తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్పందించిన కుటుంబ సభ్యులు పట్టణంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, వైద్యులు చికిత్స అందిస్తున్నారని తెలిపారు.

క్షయపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి -సీతానగరం

క్షయ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వైద్యారోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్ మోహనరావు పేర్కొన్నారు. ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక పిహెచ్‌సి పరిధిలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. పిహెచ్‌సి నుంచి స్థానిక హనుమాన్ జంక్షన్ వరకు నినాదాలతో ర్యాలీ కొనసాగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ జగన్మోహన్ మాట్లాడుతూ క్షయ లక్షణాల ద్వారా వ్యాధిని సులభంగా గుర్తించవచ్చని, రెండు వారాలు మించి దగ్గు, కఫం, జ్వరం, బరువు తగ్గడం, ఆకలి మందగించడం, ఉమ్మిలో రక్తం పడడం ఉంటాయరన్నారు. వ్యాధి గ్రస్తుని దగ్గు, తుమ్ముల ద్వారా వ్యాప్తి చెందుతాయన్నారు. ఆరోగ్య కేంద్రాల్లో కఫం పరీక్షల ద్వారా టిబి నిర్ధారణ చేయవచ్చన్నారు. అలాగే ఎక్స్ రే, ఆర్‌టిపిసిఆర్, సిబినాట్ పరీక్షలు జిల్లాలో అందుబాటులో ఉన్నాయన్నారు. ఆరు నెలలు ఉచితంగా మందులు ఇవ్వడంతో పాటు, పౌష్టికాహారం కొరకు నెలకు వెయ్యి చొప్పున ఆరు నెలలు వ్యాధి గ్రస్తుని ఖాతాలో ప్రభుత్వం ద్వారా జమ అవుతాయన్నారు. అలాగే పోషకాహారం అందిస్తున్నారని తెలిపారు. క్షేత్ర స్థాయిలో వైద్య సిబ్బంది వ్యాధి లక్షణాలు సకాలంలో గుర్తించాలని, టిబి వ్యాధిగస్తులు క్రమం తప్పకుండా మందులు వేసుకునేలా పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ ఉషారాణి, డాక్టర్ పావని, ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ హేమాక్షి, హెల్త్ సూపర్వైజర్లు సత్యవతి, భవాని, శర్మ, వైద్య, పోలీస్ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

గరుగుబిల్లి : ప్రపంచ క్షయ దినోత్సవం సందర్భంగా స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో క్షయ దినోత్సవ ర్యాలీ నిర్వహించి ప్రజలకు క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్వైజర్స్, చిన్నమ్మి, ఉదయకుమారి, ప్రసాద్, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వీరఘట్టం : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా క్షయను తరిమి కొట్టండి ఆరోగ్యాన్ని కాపాడండి, క్షయ రహిత సమాజం కోసం కలిసికట్టుగా కృషి చేద్దాం, క్షయపై అవగాహన పెంచుకుందాం, అందరం సురక్షితంగా ఉందాం, సకాలంలో చికిత్స క్షయకు పూర్తి విముక్తి, ప్రతి ఒక్కరిలో అవగాహన క్షయ వ్యాధి నివారణ, క్షయ అంతం చేయడంలో మనమంతా భాగస్వాములమని నినాదాలు చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి బి.ప్రదీప్‌కుమార్, సూపర్వైజర్లు జనార్ధన్‌రావు, శాంతకుమారి, ఎల్‌హెచ్‌పిలు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేడు షాపులకు వేలం పాట

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఈనెల 25న మేజర్ పంచాయతీకి సంబంధించిన షాపులకు వేలంపాట నిర్వహించనున్నట్లు ఇఒ బి.కోటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రోజువారీ మార్కెట్, బస్, కార్ స్టాండ్, పాత బస్టాండ్‌లోనే షాపింగ్ కాంప్లెక్స్‌లో ఆరు షాపులు, ఇదే స్థలంలో 9,10వ ప్లాట్లు, మేజర్ పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న 8 షాపులకు సంబంధించి బహిరంగ వేలం వేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు మధ్యాహ్నం 3 గంటలకు వేలం పాటలో పాల్గొనాలని ఆయన కోరారు.

అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో గల రెండు అంగన్వాడీ సహాయకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఐసిడిఎస్ పిఒ బి.శ్రీనివాస రావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పార్వతీపురం రెల్లి వీధి 25వ వార్డు-1లో ఎస్సీకి , 4వ వార్డు-1లో బీసీ-డి కి అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకుల పోస్టులు ఖాళీలు ఉన్నట్లు చెప్పారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ మేరకు నిర్దేశించిన కమ్యూనల్ రోస్టర్ రిజిస్టర్ అనుసరించి, కేటగిరీ అభ్యర్థులతో పోస్టులను భర్తీ చేయడం జరుగుతుందని అన్నారు. ఆసక్తి గల మహిళలు తమ దరఖాస్తులను ఈ నెల 31లోగా తమ కార్యాలయానికి అందజేయాలని కోరారు. మరిన్ని వివరాలకు శిశు అభివృద్ధి పథక అధికారి, పార్వతీపురం కార్యాలయాన్ని సంప్రదించి వివరాలు తెలుసుకోవచ్చని ఆయన ఆ ప్రకటనలో వివరించారు.

ఉపాధి బకాయిలు చెల్లించండి

ప్రజాశక్తి- సీతానగరం

ఏడు నెలలుగా ఉన్న ఉపాధి బకాయిలను వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు రెడ్డి ఈశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయం వద్ద సోమవారం చినబోగిలి, అప్పయ్యపేట గ్రామ కూలీలతో కలిసి ఆయన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు నెలలుగా పనిచేస్తున్న ఉపాధి కూలీలకు ఇంతవరకు వేతనాలు చెల్లించకపోవడం, గత ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న కొన్ని గ్రామాల్లో ఇంతవరకు పనులు కల్పించకపోవడం దారుణమన్నారు. ఉపాధి హామీ పథకంలో అనేక రకాలు పనులు ఉన్నప్పటికీ ఫారం ఫండ్(ఇంకుడు గుంతలు) పనులే చేపట్టాలని జిల్లా అధికార యంత్రాంగం ఆదేశిస్తుందన్నారు. ఏప్రిల్, మే నెలలో ఎండలు తీవ్రంగా ఉండి భూమి గట్టిదనంగా ఉంటుందని, ఈ ప్రాంతంలో రైతులు మెట్టు భూములు తక్కువగా ఉంటాయని, పల్లపు భూముల్లో ఇంకుడు గుంతలు తవ్వడానికి భూ యజమానులు ముందుకు రావడం లేదని, తద్వారా ఇంకుడు గుంతల తవ్వడం వేతనదారులకు కష్టతరంగా ఉందని చెప్పారు. ఉపాధి పనులు ద్వారా కూలీల కోసం కేటాయించిన ఉపాధి నిధులను ఇతర పనులకు మళ్లిస్తున్నందు వల్ల ఉపాధి కూలీలకు నిర్దేశించిన వంద రోజులు పనులు, 14 రోజుల్లో బిల్లులు చెల్లింపు వంటి లక్ష్యాలను చేరుకోలేకపోతున్నారన్నారు. తక్షణమే అందరికీ పూర్తిస్థాయిలో పనులు కల్పించాలని, బకాయి ఉన్న ఏడు వారాల బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఎపిఒకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు చందనపల్లి కృష్ణ, ప్రజాసంఘాలు నాయకులు రెడ్డి వేణు, జి. వెంకటరమణ, ఆర్, రమణ మూర్తి, బి అప్పారావు, ఉపాధి వేతన దారులు జి. భాస్కర్ రావు, దినేష్, అజయ్, పార్వతి, రమణమ్మ, మేరీ పాల్గొన్నారు.


వినతి పత్రాన్నిస్తున్న కూలీలు, నాయకులు

బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు : ఎస్‌పి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

జిల్లా వ్యాప్తంగా క్రికెట్ బెట్టింగ్‌పై ప్రత్యేక నిఘా పెడుతున్నామనీ, బెట్టింగులకు పాల్పడినా ప్రోత్సహించినా చట్టపరంగా కఠినమైన చర్యలు తీసుకుంటామని, క్రికెట్ మ్యాచ్ లను వినోదం కోసం మాత్రమే చూడాలే తప్పా కుటుంబాలలో విషాదం నింపేలా ఉండకూడదని ఎస్‌పి ఎస్‌వి మాధవ్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐపిఎల్ క్రికెట్ మ్యాచ్‌లు జరుగుతున్న నేపథ్యంలో ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగులకు పాల్పడే యువత అప్రమత్తం ఉండాలని, ఆర్థికంగా జీవితాలను నాశనం చేసే బెట్టింగు యాప్‌ల జోలికి పోవద్దని హెచ్చరించారు. క్రికెట్ మ్యాచ్‌లు జరుగుతున్న నేపథ్యంలో వీటిని అదునుగా చేసుకొని కొందరు స్వార్థపరులు, చెడు నడత కలిగిన వ్యక్తులు క్రికెట్ బెట్టింగ్ లకు తెరలేపే అవకాశం ఉందన్నారు. బెట్టింగ్‌లకు బలి అవుతున్నవారిలో ఎక్కువ శాతం యువతే ఉంటున్నారన్నారు. సులభంగా అధిక నగదును అర్జించవచ్చునని యువతకు ఆశ చూపుతూ బెట్టింగ్ ఊబిలో దించుతారన్నారు. ఒక్కసారి బెట్టింగ్‌లకు అలవాటు పడితే వాటి నుండి బయటకు రావడం కష్టతరం అవుతుందన్నారు. బెట్టింగ్‌లో ఒకసారి ఆదాయం వచ్చినా పలుమార్లు నష్ట పోవడం జరుగుతుందన్నారు. ఆ నష్టాలను భర్తీ చేసుకోవడానికి, చేసిన అప్పులను తీర్చడానికి యువత దొంగతనాలకు, ఇతర నేరాలకు పాల్పడుతూ తమ భవిష్యత్తుని అంధకారం చేసుకుంటున్నారన్నారు. బెట్టింగ్ అనేది పెనుభూతం లాంటిదని, ఆశ చూపి అధ:పాతాళానికి నెట్టేస్తుందని యువత దానికి బలికాకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. క్రికెట్ బెట్టింగ్ వల్ల అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, డబ్బులు పోగొట్టుకుని అనేక మంది సూసైడ్ చేసుకుంటున్నారని, యువత, విద్యార్థులు బెట్టింగ్ జోలికి వెళ్లకుండా చదువుపై, తమ ఉజ్వల భవిషత్తుపై దృష్టి సారించాలని కోరారు. తల్లి దండ్రులు తమ పిల్లలను గమనిస్తూ ఉండాలన్నారు. గతంలో బెట్టింగ్‌లకు పాల్పడిన వారిపై, అనుమానితులపై నిఘా ఉంచామన్నారు. జిల్లాలో ఎక్కడైనా క్రికెట్ బెట్టింగ్‌లు జరుగుతున్నట్లు తెలిస్తే డయల్ 112/100కు, సంబంధిత పోలీస్ అధికారులకు కాల్ చేసి సమాచారం అందించాలని, సమాచారమిచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

సాదాసీదాగా సామాజిక తనిఖీ

ప్రజాశక్తి- సీతానగరం

స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో సోమవారం 2023 - 24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కాలంలో చేసిన రూ.28.50 కోట్ల పనులకు సంబంధించి సామాజిక తనకి నివేధికను డ్వామా పీడి రామచంద్రరావు అధ్యక్షత ప్రజా వేదికలో వెల్లడించారు. ఈ సందర్భంగా 35 గ్రామపంచాయతీలో వివిధ రూపాల్లో జరిగిన పనులు, వేతనాలు, నిధులు గురించి బృంద సభ్యులు చదివి వినిపించారు. చిన్న అంకలం గ్రామంలో మొక్కల పెంపకంలో భాగంగా 600 మొక్కలకు గాను సామాజిక తనకి బృందం తనిఖీ నిర్వహించగా మొక్కలు పూర్తిగా లేకపోవడంతో చర్యలు తీసుకోవాలని నివేదిక సమర్పించారు. చినబోగిలి, భూర్జలో నెమ్ బోర్డులు లేకపోవడంతో తనిఖీలో సిఆర్‌డి ఎకౌంటు చెల్లించారు. వివిధ గ్రామాల్లో ఫిర్యాదుల మేరకు ఉపాధి సమస్యలు ఈనెలాఖరులోగా పరిష్కరించకపోతే చర్యలు తీసుకుంటామని డ్వామా పీడీ రామచంద్రరావు హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎంపిపి రవణమ్మ, శ్రీరాంనాయుడు, జెడ్‌పిటిసి బాబ్జి, ఎంపిడిఒ త్రివక్రమరావు, యస్‌అర్‌పి మాదవ, ఎపిఒ భాను, వివిధ గ్రామాల సర్పంచులు వివిధ గ్రామాల ఎంపిటిసిలు ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సామూహిక విత్తన గుళికల తయారీ

ప్రజాశక్తి- పాచిపెంట

గిరిజన రైతులందరూ పోడు వ్యవసాయంలో పండించే తెల్ల జొన్న, సజ్జలు, పెసర, మినుము, కంది వంటి పంటలతో విత్తన గుళికలు తయారు చేసుకుని పోడులో చల్లుకుంటే చీడపీడలలేని ఆరోగ్యవంతమైన అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని రాయివలస, పెద్దకంచూరు, చాపరాయివలస గ్రామాలలో సోమవారం రైతులతో సామూహిక విత్తన గుళికల తయారీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తన గుళికలు తయారుచేసి చల్లుకోవడం వల్ల అనేక లాభాలు ఉన్నాయన్నారు. సీజన్ కోసం చూడకుండా పొడి దుక్కిలోనే చల్లుకోవచ్చని, కొద్దిపాటి జల్లులకే నాణ్యమైన మొలకలు వస్తాయని అన్నారు. విత్తనానికి పక్షులు, కీటకాలు చెదలు చీమల బెడద ఉండదని, విత్తన తేజం ఎక్కువగా ఉంటుందని, ఆరోగ్యవంతమైన మొలక రావడం వల్ల చీడపీడల ఉధృతి తగ్గుతుందని చెప్పారు. మొలకెత్తిన విత్తనంకు గుళిక నుండే పోషక సరఫరా మొదలవుతుందని అన్నారు. అనంతరం విత్తన గుళికల తయారీ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు భారతి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సురేష్, తిరుపతి నాయుడు, చదలరాజు, విజయ్, కుమార్ రైతులు పాల్గొన్నారు.

ఎపిడిపై విచారణ వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

వెలుగు ఎపిడి సత్యంనాయుడుపై వస్తున్న ఆరోపణలపై విచారణ వేగవంతం చేయాలని కోరుతూ ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవకు గిరిజన సంఘం నాయకులు సోమవారం వినతిని అందజేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం సహాయ కార్యదర్శి కె.రామస్వామి మాట్లాడుతూ వెలుగు ఎపిడి సత్యంనాయుడు పనిచేసిన కాలంలో కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులు ఖర్చు పైన వివిధ కార్యాలయాలకు కొనుగోలు చేసిన యంత్రాలు సామగ్రి పైన పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టాలని కోరారు. వినతిని అందజేసిన వారిలో గిరిజన సంఘం నాయకులు రామారావు, సిఐటియు నాయకులు సాంబమూర్తి ఉన్నారు.

సాగును అడ్డుకున్న వారిపై చర్యలు

కొమరాడ మండలం గుణదతీలేసి పంచాయతీ లాబేసుకు చెందిన 18 మంది రైతులు సాగు చేస్తున్న డి-పట్టా భూమిని కొట్టు గ్రామానికి చెందిన రైతులు అడ్డుకుంటున్నారని వీరిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఐటిడిఎ పిఒకు గిరిజన సంఘం నాయకులు జిల్లా సహాయ కార్యదర్శి కె.రామస్వామి, నాయకులు రామారావు వినతినిచ్చి మాట్లాడారు. లాబేసుకు చెందిన 18 మంది గిరిజన రైతులు 30 ఏళ్లుగా సాగు చేస్తున్న డి-పట్టా భూముల్లో కొట్టు గ్రామానికి చెందిన కొంతమంది రైతులు వచ్చి ఇది తమ భూమి అంటూ దౌర్జన్యానికి పాల్పడడం దారుణమన్నారు. అధికారులు స్పందించి తమ భూమిని తమకు అప్పజెప్పాలని గిరిజనులు కోరారు.



నిరసన తెలుపుతున్న మహిళలు

తాగునీటి కోసం తిప్పలు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలోని తాళ్లబురిలో తాగునీటి కోసం మహిళలు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని, ఇంటింటికి కుళాయి అని చెప్పి వీధి కొళాయి కన్నా అధ్వానంగా తాగునీరు సరఫరా చేయడం దారుణమని ఐద్వా జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి విమర్శించారు. ఈ మేరకు సోమవారం ఆ గ్రామ సచివాలయం ఎదుట మహిళలతో కలిసి ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటింటికీ కొళాయి వస్తుందని మహిళలు సంబర పడ్డారని, అయితే ఇంటింటి కుళాయికి ఎగనామం పెట్టి వీధి కుళాయిగా మార్చేస్తారన్నారు. ఆ వీధి కుళాయి ద్వారానైనా రోజుకు అరగంటైనా నీరివ్వడంలేదన్నారు. తాగునీటి కోసం కొళాయి వద్ద మహిళలు క్యూలో నిలబడలి తన వాటా వచ్చేంత వరకూ నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఇదిఇలా ఉండగా, ఎల్లంపేట, మండి వీధి ప్రజలకు కో ఆపరేటివ్ సెంటర్ వద్ద కుళాయి నీరు అసలు రావడంలేదు. అలాగే పాత బజారు వీధి, శాలిపేట. కోనార్ల వీధిల్లోనూ నీళ్ల రావడం లేదు. దీంతో మహిళల బాధలు వర్ణనాతీతం. ఇప్పటికైనా గ్రామీణ నీటి సరఫరా అధికారులు స్పందించి తక్షణమే అన్ని వీధుల్లో రోజంతా కొళాయి ఇవ్వాలని, 3 నెలల్లో ఇంటింటికి కొళాయి వేసి నీరు ఇవ్వాలని, లేకపోతే ఉద్యమిస్తారని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు ఉమామహేశ్వరి, గ్రామ మహిళలు పాల్గొన్నారు.

ముంగోడు వలసకు రోడ్డు వేయండి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలోని జమదాల పంచాయతీ పరిధి లోని గిరిజన గ్రామమైన ముంగోడివలసకు సరైన రోడ్డు సదుపాయం లేక ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే రహదారి సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం గ్రామానికి చెందిన తాడంగి దిబ్బన్న ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే విజయచంద్రను క్యాంపు కార్యాలయంలో కలిసి వినతి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 30 ఏళ్లుగా తాము ఈ గ్రామంలో నివసిస్తూ పోడు వ్యవసాయం చేసుకుంటూ బతుకుతున్నామని, తమకు పోడు పట్టాలు మంజూరు చేయాలని, అలాగే తమ గ్రామానికి తాగునీరు, రహదారి సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యేను కోరినట్లు తెలిపారు

రోడ్డు మలుపులో మొక్కలు తొలగింపు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

మండలంలోని పలు రహదారుల మలుపుల్లో ప్రాణాంతకంగా మారిన పిచ్చిమొక్కల పొదలను రూరల్ ఎస్సై సంతోషి కుమారి ఆధ్వర్యంలో సామాజిక బాధ్యతగా తొలగింపు కార్యక్రమం చేపట్టారు. సోమవారం వెంకంపేట కూడలి నుంచి పెద్ద బొండపల్లి తామర చెరువు గట్టు వరకు యంత్రాలతో పొదలను తొలగించారు. అలాగే కృష్ణపల్లి, పెదమరికి తదితర గ్రామాలకు వెళ్లే రహదారులను కూడా తొలగిస్తామని ఈ సందర్భంగా ఆమె తెలిపారు.

వెలుగు కార్యాలయానికి పరీక్షా పేపర్లు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు నిర్వహించిన పరీక్షలకు సంబంధించి మూల్యాంకనం పూర్తి చేశారు. సోమవారం ఆయా గ్రామాలకు చెందిన విఎఒలు స్థానిక వెలుగు కార్యాలయానికి పరీక్ష పేపర్లను అందజేశారు. మండలంలోని 25 గ్రామ పంచాయతీలకు సంబంధించి 1419 మంది అభ్యాసకులకు గానూ 1338 మంది అభ్యాసకులు పరీక్షలు రాసినట్టు ఎపిఎం పి.అప్పలనాయుడు వెల్లడించారు. పరీక్షలను సీసీలు చందాన తిరుపతిరావు, రామినాయుడు, లక్ష్మణరావు, పర్యవేక్షించారని చెప్పారు.

ప్లాస్టిక్ కవర్లు వాడితే జరిమానా

పార్వతీపురం టౌన్: మున్సిపల్ పరిధిలో ప్లాస్టిక్ కవర్లు వాడకాలపై జిల్లా కలెక్టర్‌తో పాటు మున్సిపల్ కమిషనర్ నిషేధం విధించడంతో వారి ఆదేశాలను అనుసరించి సోమవారం ప్రజారోగ్య విభాగం అధికారులు, సచివాలయాల శానిటరీ సెక్రటరీలు ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న చిరు వ్యాపారులు, కాఫీ, టిఫిన్ హోటళ్ల దుకాణాల్లో సోదాలు నిర్వహించి ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకుని పలువురి యజమానుల నుంచి అపరాధ రుసుం వసూలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొదటి విడతగా నిర్వహించిన సోదాల్లో తక్కువ మొత్తంలో అపరాధ రుసుం వేస్తున్నామని, రెండోసారి ప్లాస్టిక్ కవర్లు దొరికితే పెద్ద మొత్తంలో అపరాధ రుసుం వసూలు చేస్తామని హెచ్చరించారు. ఈ సోదాల్లో 15 సచివాలయాల శానిటరీ సెక్రటరీలు పాల్గొన్నారు.

వాహన ఫిట్నెస్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి

సీతానగరం: వాహన వినియోగదారులు వాహన సామర్థ్య నిర్ధారణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయంచంద్ర కోరారు. మండలంలోని చినబోగిలిలో ప్రభుత్వ నిధులతో నిర్మించిన ఈ కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. జిల్లాకు ప్రత్యేకంగా ఈ కేంద్రం చినభోగిలిలో మంజూరైందన్నారు. జిల్లాలోని అన్ని రకాల వాహన యజమానులు తమ వాహనాలను ఇక్కడకు తీసుకొచ్చి ప్రభుత్వ నిర్దేశించిన రుసుంను చెల్లించి ధ్రువపత్రాలు పొందేందుకు ఇక్కడ వెసులుబాటు కల్పించిందన్నారు. ఆర్టీవో కార్యాలయానికి ఇకపై వెళ్లకుండా అక్కడ ఆ శాఖ అందించే సేవలన్ని ఇక్కడ పొందవచ్చని అన్నారు.కార్యక్రమంలో వంశీ, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సభ్యుల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం: జిల్లాలో బాలల సంక్షేమ సమితి, బాలల న్యాయ మండలిలో సభ్యులను నియమించేందుకు అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు అదనపు జిల్లా పర్యవేక్షణ అధికారి బివి రవికుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పూర్తి నోటిఫికేషన్, అర్హతల వివరాలు, దరఖాస్తు ఫారం https://wdcw.ap.gov.in అనే వెబ్సైట్ నుంచి పొందవచ్చని ఆయన చెప్పారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు వెబ్సైట్ నుండి వివరాలు, దరఖాస్తు డౌన్లోడ్ చేసుకొని ఏప్రిల్ 9 లోగా డైరెక్టరు, బాలల సంక్షేమము, సంస్కరణల సేవలు, వీధి బాలల సంక్షేమ శాఖ, విజయవాడ చిరునామాకు పంపాలని ఆయన తెలిపారు. వివరాలకు అదనపు జిల్లా పరివీక్షణ అధికారి బి.వి.రవికుమార్ (9100045398) ను సంప్రదించవచ్చని ఆయన పేర్కొన్నారు.